## ఘనంగా స్వయం పాలనాదినోత్సవం..

కులకచర్ల, నవంబర్ 22 : మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఉత్తమ ప్రతిభను కనబర్చిన విద్యార్థులను అభినందించారు.

## మెనూ ప్రకారం భోజనం అందించాలి

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో మహేష్‌బాబు

దోమ, నవంబర్ 22: విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని ఎంపీడీవో మహేష్‌బాబు అన్నారు. మండల పరిధిలోని శివారెడ్డిపల్లి, బాసుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలతో పాటుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో కలిసి శుక్రవారం ఎంపీడీవో పరిశీలించారు. ఏజెన్సీ వారు మెనూ ఫాలో అవుతున్నారా లేద్నా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఇచ్చే ప్రతీ ఆహార పదార్థాలను ఎక్స్‌పైరీ డేట్‌ను పరిశీలించి అందజేయాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రవి,సమీరా, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మధ్యాహ్నభోజన నిర్వాహకులు పాల్గొన్నారు.

## పాఠశాలలో దొంగతనానికి యత్నం..

కొడంగల్, నవంబర్ 22 : మండలంలోని హస్నాబాద్ గ్రామంలో గుర్తు తెలియని దుండగులు పాఠశాలలో దొంగతనానికి ప్పాడినట్లు పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు అక్రూబేగం తెలిపారు. గురువారం పాఠశాల సమయం పూర్తైన తర్వాత తాళం వేసి వెళ్లినట్లు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం పాఠశాల సమయానికి చేరుకొని చూసే సరికి టీవీ ద్వారా పాఠాలు బోధించి తరగతి గది తలుపులు విరగొట్టినట్లు గుర్తించామన్నారు. దీంతో గ్రామస్తులతో కలిసి తరగతిని పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోలీసులు పాఠశాలను పరిశీలించినట్లు తెలిపారు. అయితే అదృష్ట వశాత్తు ఎలాంటి వస్తువులు దొంగలించబడలేదని, టీవీని అపహరించేందుకే పాల్పడి ఉండవచ్చని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అమాయక గిరిజన రైతులను బలిచేయకండి

కులకచర్ల, నవంబర్ 22 : లగచర్ల ఘటనలో అమాయక గిరిజన రైతులను బలి చేయవద్దని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాద్‌రావు, దిశ అడ్వైజర్ కమిటీ సభ్యుడు డాక్టర్ జానకీరాం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ లగచర్ల ఘటనపై రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమీషన్‌కు పూర్తి నివేదిక అందజేయాలని, పోలీస్ హింసకు గురైన వారికి న్యాయం చేయాలని, అమాయక గిరిజన రైతులపై వేధింపులను ఆపాలని కలెక్టర్, ఎస్పీలను కోరారు. గిరిజన రైతుల సాగుభూములను స్వాధీనం చేసుకుంటే వారు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. ఫార్మాకంపెనీలను పడావు పడ్డ భూముల్లో ఏర్పాటు చేయవచ్చన్నారు. పోలీసుల చిత్రహింసలకు గురైన బాధితులకు ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసి వైద్యసౌకర్యం కల్పించాలని, అక్రమంగా అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ తమ స్వార్థ రాజకీయాల కోసం అమాయక గిరిజన తండా వాసులను జైల్లో వేయడం వలన ఇంటి దగ్గర ఉన్న వృద్ధులు, వారి కుటుంబ సభ్యులు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు.

## దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌యూనిట్ అధికారి ఫకీరప్ప

కొడంగల్, నవంబర్ 22 : దోమల నివారణకు ప్రతి ఒక్కరూ చర్యలు తీసుకోవాలని సబ్‌యూనిట్ అధికారి ఫకీరప్ప సూచించారు. శుక్రవారం దుద్యాల మండలం చిల్‌ముల్‌మైల్వార్ గ్రామంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలో మలేరియా, ఫైలేరియా దోమల నివారణ చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమ కాటు వల్ల మలేరియా, ఫైలేరియా, చికున్‌గున్యా, మెదడువాపు వ్యాధి, డెంగీ వంటి వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉందన్నారు. దోమల నివారణకు గాను ఇంటితో పాటు పరిసరాల పరిశుభ్రతతప్పకుండా పాటించాలని సూచించారు. నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం పాఠశాలలోని తరగతి గదుల్లో దోమల నివారణకు గాను గ్రామ పంచాయతీ వర్కర్ల సాయంతో ఆల్ఫాసైఫా మైత్రిన్ మందును పిచికారీ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కోత లేకుండా వాల్వ్ రిప్లేస్‌మెంట్



రోగితో వైద్యులు శ్రీనివాస్ తదితరులు

### క్లిష్టమైన శస్త్రచికిత్సతో రోగి ప్రాణాలను కాపాడిన నిమ్స్ వైద్యులు

ఖైరతాబాద్, నవంబర్ 22 : నిమ్స్ మరో మైలురాయిని అధిగమించింది. దవాఖాన చరిత్రలోనే మొదటిసారిగా అనేక దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగికి విజయవంతంగా కోత లేకుండా వాల్ రిప్లేస్‌మెంట్ చేసి వైద్యులు రికార్డు సృష్టించారు. నగరానికి చెందిన 56 ఏండ్ల రోగి కొంత కాలంగా రక్త పోటు, మధుమేహం, దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధితో బాధపడుతూ నిమ్స్‌లో చేరాడు. అప్పటికే హీమో డయాలసీస్ చేసుకుంటున్న ఆ రోగికి కొత్త సమస్య వచ్చింది. వైద్య పరిభాషలో మైట్రాల్ వాల్వ్ స్టీనియోసిస్‌గా పిలిచే ఈ వ్యాధికి చికిత్స అందించాలంటే అప్పటికే దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న సదరు రోగికి ఓపెన్ హార్ట్ సర్జరీ చేస్తే అత్యంత ప్రమాదకరమని వైద్యులు గుర్తించారు. వివిధ పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు ఎలాంటి కోత లేకుండానే ఆధునిక విధానంలో చికిత్స అందించాలని నిర్ణయించారు. కార్డియాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ బి. శ్రీనివాస్ వైద్యులు డాక్టర్ మణి కృష్ణ, డాక్టర్ అభినయ్‌రెడ్డి, డాక్టర్ కె. అనురాగ్ బృందం కాంప్లెక్స్ ట్రాన్స్‌క్యాథటర్ మైట్రా వాల్వ్ రిప్లేస్‌మెంట్ విధానంలో చికిత్స చేసి సమస్యను తీర్చారు. ఇలాంటి చికిత్సలతో రోగి రెండు రోజుల్లోనే సాధారణ స్థితి వస్తారని, వైద్యుల సూచనలు పాటిస్తే సరిపోతుందని డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

# పంటల మార్పిడితో అధిక లాభాలు..

- రోగకారక జీవుల కట్టడికి ఎంతోమేలు
- వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు

ఇబ్రహీంపట్నంరూరల్, నవంబర్ 22 : భూగర్భజలాలు పుష్కలంగా ఉన్న నేపథ్యంలో రైతులు ఒకేరకం పంటల సాగుపై దృష్టి సారిస్తున్నారు. ఒకేరకమైన పంటలను సాగుచేయటం వలన భూమిలోని సారం తగ్గిపోవటంతో పాటు క్రిమికీటకాలు ఇంకా వృద్ధి చెందే అవకాశమున్నందున రైతులు ఒకేరకమైన పంటలను సాగుచేయటం విధానానికి స్వస్తి చెప్పి పంటల మార్పిడి విధానాన్ని చేపట్టాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఒకేరకమైన పంటలను సాగు చేయటం వల్ల పొలాల్లో భూసారం తగ్గుతుంది. రోగాలను కలిగించే పురుగుల సంఖ్య బాగా పెరిగి దిగుబడి తగ్గుతుంది. పంటల మార్పిడి వల్ల భూమిలోని పోషకాలు సంవృద్ధిగా అందుతాయి. పంటల మార్పిడితో కలిగే ప్రయోజనాలపై ప్రత్యేక కథనం..

ఒకే పంటను ఒకే పొలంలో వరుసగా పండించటం వల్ల చీడపీడల ఉధృతి అధికం కావడానికి అనుకూల పరిస్థితులు ఏర్పడుతాయి.

పురుగు జీవితచక్రం పూర్తి చేసుకుని తీవ్రమైన హాని కలిగించే స్థితికి చేరుకుంటుంది.

పంట మార్పిడి చేసినప్పుడు పురుగు జీవితచక్రం చేధించబడుతుంది. ఎందుకంటే ఒక పంటపై ఆశించే పురుగులు మరొక్క పంటపై ఆశించడం సాధారణంగా జరుగదు.

వేగంగా వృద్ధి చెందే కొన్ని రకాల పురుగులను పంట మార్పిడి వల్ల అదుపులో పెట్టవచ్చు.

పత్తి, మిరప మొదలైన పంటలను మార్పిడి చేయకుండా సాగు చేయటం వల్ల ఒకే లోతు పొరల నుంచి పోషకాలు తీసుకోవడంతో నేల నిస్సారమ వుతుంది.

వరి, వేరు శెనగ, జొన్న, మొక్కజొన్న వంటి పైర్లు నేలపై పొరల నుంచి పోషకాలను తీసుకుంటాయి.

నేల భౌతిక లక్షణాలు, స్వభావం దెబ్బతినకుండా ఉండటానికి, చీడపీడల అభివృద్ధిని నిరోధించడానికి పంట మార్పిడి తప్పక చేయాలి.

అప్పుడప్పుడు అవసరాన్ని బట్టి పశుగ్రాసం కోసం గడ్డిజాతిపైర్లు, భూసారాన్ని పెంచడానికి పచ్చిరొట్ట పైర్లు వేసుకోవాలి.

### పంటలు సాగుచేయాల్సిన విధానం..

వరి తర్వాత మినుము, పెసర, శనగ వేయటం వల్ల సుడిదోమ, టుంగ్రో వైరస్‌ను నివారించవచ్చు.

చెరకు తర్వాత వరి వేయటం వల్ల వేరు పురుగును తగ్గించొచ్చు. అలాగే, వరిలో దోమపోటు నివారించవచ్చును.

పత్తివేసిన పొలంలో జొన్న, మొక్కజొన్న, నువ్వులు, మినుములు వేస్తే లద్దె పురుగు, పచ్చ పురుగులను నివారించవచ్చు.

జొన్న, మొక్కజొన్న తర్వాత కందిని సాగుచేస్తే కాయ తొలుచు పురుగు ఉధృతి తగ్గుతుంది.

వరిని సాగుచేసే పొలంలో ముందుగా పప్పుధాన్యాలను సాగుచేయడం వల్ల నేల సారవంతమవుతుంది.

వేరుశనగలో ఆకుముడతను నివారించేందుకు పప్పుజాతికి చెందిన పైర్లు వేయాలి.

కంది, మిరప పంటల్లో ఎండు తెగులు నివారణకు జొన్న, మొక్కజొన్న పంటలు సాగుచేయాలి.

నులి పురుగు సమస్య అధికంగా ఉన్న ప్రాంతాల్లో వేరుశెనగ, మిరప, పొగాకు, వంగపైర్ల సాగును కొన్ని పంట కాలాల వరకు ఆపాలి.

ఆహార పంటలైన వరి, జొన్న, మొక్కజొన్న, సజ్జ పంటలను పప్పుజాతి పంటలైన పెసర, మినుము, వేరుశనగ సాగుతో మార్పిడి చేయాలి.

ఆహార వాణిజ్య పంటలను పశుగ్రాస పైర్లతో మరోసారి మార్పిడి చేయడం లాభదాయకం.

### పంటమార్పిడితో రోగాలకు అడ్డుకట్ట

రైతులు ఒకేరకమైన పంటలు సాగుచేయడం ద్వారా ఆ పంట మొక్కలకు అవసరమైన పోషకాలు తక్కువవుతాయి. రోగకారక పురుగుల ఉధృతి పెరిగి దిగుబడి తగ్గుతుంది. వరుసగా ఒకే పం టను కాకుండా వివిధ రకాల పంటల సాగుతో పురుగుల జీవిత చక్రాన్ని నిలిపివేయవచ్చు. దాంతో రైతులు మంచి లాభాలను పొందగలుగుతారు. రైతులు ఒకే రకమైన పంటల సాగుకు పూర్తిగా స్వస్తి చెప్పి పంటల మార్పిడి విధానానికి శ్రీకారం చుట్టడం ద్వారా మంచి లాభాలు గడించే వీలుంటుంది. **శ్రవణ్‌కుమార్, వ్యవసాయ విస్తరణాధికారి**

# హైడ్రా ఓ ప్రత్యేకం.. జీహెచ్‌ఎంసీలోది కాదు

### గ్రేటర్‌తో పాటు మరో 27 మున్సిపాలిటీలు మావే..!

### డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లో ఐఎండీతో కలిసి పనిచేస్తాం..

### ఇండియన్ మెటరాలాజికల్ సదస్సులో హైడ్రా కమిషనర్ రంగనాథ్

ఐఎండీ సదస్సులో పాల్గొన్న హైడ్రా కమిషనర్ రంగనాథ్ తదితరులు

సిటీబ్యూరో, నవంబర్ 22(నమస్తే తెలంగాణ): హైడ్రా అనేది ఒక ప్రత్యేక విభాగమని, జీహెచ్‌ఎంసీలో భాగం కాదని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. గతంలో ఈవీడీఎం పేరుతో జీహెచ్‌ఎంసీలో ఒక విభాగం ఉండేదని, అప్పుడు ఐఏఎస్, కమిషనర్లు ఉండేవారని, ఇప్పుడు ఒక సెపరేట్ వింగ్‌గా ఏర్పడిందని రంగనాథ్ చెప్పారు. హైడ్రా పరిధిలోకి జీహెచ్‌ఎంసీతో పాటు ఓఆర్‌ఆర్ లోపల ఉండే మరో 27 మున్సిపాలిటీలు కూడా వస్తాయన్నారు. ఇండియన్ మెట్రాలాజికల్ డిపార్ట్‌మెంట్ 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అమీర్‌పేట్‌లోని సెస్ ఆడిటోరియంలో తెలంగాణలో ఐఎండీ వెదర్, క్లైమేట్ సర్వీసెస్‌పై ఏర్పాటు చేసిన స్టేక్ హోల్డర్స్ ఒకరోజు సదస్సులో రంగనాథ్ పాల్గొన్నారు. ప్రారంభోత్సవ సదస్సును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన అనంతరం, రంగనాథ్ మాట్లాడుతూ ఐఎండీ 1875లో ఏర్పడిందని, హైడ్రా ఈ ఏడాది జూలైలో ఏర్పడిందని, డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి ఐఎండీతో కలిసి పనిచేస్తామన్నారు. ప్రభుత్వ స్థలాలు, నగరంలోని చెరువులు పరిరక్షించడంతో పాటు ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడినప్పుడు ప్రజలను కాపాడేందుకు ప్రభుత్వం హైడ్రాను కొత్తగా ఏర్పాటు చేసిందన్నారు. హైడ్రా దేశంలోనే మొదటిసారి ఏర్పాటైందని, హైడ్రాకు మొదటి కమిషనర్‌గా రావడం తనకు సంతోషంగా ఉందన్నారు. జల వనరులు, ప్రభుత్వ స్థలాలు, ప్రభుత్వ ఆస్తులు, చెరువులు ఆక్రమణకు గురవుతున్నాయని, వాటిని కాపాడటమే హైడ్రా బాధ్యత అన్నారు. హైదరాబాద్ అంటేనే గొలుసుకట్టు చెరువులని, గతంలో ఒక చెరువుకు మరో చెరువుకు కనెక్టివిటీ ఉండేదని, ఇప్పుడా కనెక్టివిటీ దెబ్బతిందన్నారు. తెలంగాణకు సముద్ర తీరం లేకున్నా.. భారీ వర్షాలతో ముంపు పొంచి ఉందని, ఈ నేపథ్యంలో భారతీయ వాతావరణ శాఖ సమాచారం చాలా ముఖ్యమని, సాంకేతికతను అందిపుచ్చుకొని వర్ష సమాచారం ఇవ్వడం ఉపయోగంగా ఉంటుందన్నారు. ఐఎండీ ఏ ప్రాంతంలో ఎంత మొత్తంలో వర్షం పడుతున్నదని, ఎక్కడ వరద ముప్పు ఉంటున్నదో అంచనావేసి ప్రజలను అప్రమత్తం చేయడం వంటి విధానాలను అందిపుచ్చుకొని ప్రయత్నిస్తున్నామన్నారు.

ప్రకృతి వైపరీత్యాలపై ప్రజలను అప్రమత్తం చేయడంలో ఐఎండీ పాత్ర చాలా కీలకమని, ఐఎండీ పనితీరుతోనే ప్రాణ, ఆస్తి నష్టాలు తగ్గాయని గుర్తుచేశారు. డిజాస్టర్స్‌లో కూడా చాలా మార్పులు వస్తున్నాయని, తెలంగాణలో అర్బనైజేషన్ పెరుగుతున్నదని, 2050 నాటికి 50 శాతం దాటుతుందని చెప్పారు. మెట్రో సిటీస్‌లో వాతావరణ మార్పులు అధికంగా ఉంటున్నాయని, క్లౌడ్ బర్స్ట్స్ పెరుగుతున్నాయన్నారు. హైదరాబాద్‌లో నాలాలు, చెరువులు ఆక్రమణలకు గురయ్యాయని, వర్షం పడినప్పుడు వరద నీరు ఇంకడానికి చాలా సమయం పడుతున్నదని, సాయంత్రం నాలుగైదు గంటలకు వర్షం పడితే భారీగా వరదనీరు వచ్చి చేరుతున్నదన్నారు. వరద నీరు ఇంకడానికి మార్గాలు లేక సిటీలో 150 వాటర్ లాగింగ్స్ ఉన్నాయని చెప్పారు. అర్బన్ డిజాస్టర్ల మీద ఫోకస్ పెట్టాలని, ఇప్పటి వరకు 157 ఏడబ్ల్యూఎస్ స్టేషన్లున్నాయని, ఇంకా కావలసిన అవసరముందన్నారు. ప్రజలు వెదర్ అలర్ట్స్‌ని సీరియస్‌గా తీసుకునేలా హైడ్రా పనిచేస్తుందని రంగనాథ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ మెట్రాలజికల్ సెంటర్ హెడ్ డా.కె.నాగరత్న పాల్గొన్నారు.

# నేటి విద్యార్థులే రేపటి సమాజ నిర్మాతలు

### మాజీ ప్రభుత్వ సలహాదారుడు డాక్టర్ కేవీ రమణాచారి

విద్యార్థుల సైన్స్ ఎగ్జిబిషన్ ప్రదర్శన

చిక్కడపల్లి, నవంబర్ 22: నేటి విద్యార్థులే రేపటి సమాజ నిర్మాతలని మాజీ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. తెలంగాణ బాలోత్సవం కమిటీ ఆధ్వర్యంలో బాగ్ లింగంపల్లి సుందరయ్య కళా నిలయంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న 4వ పిల్లల జాతర శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. నగరంలోని వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అదే విధంగా సైన్స్ ఎగ్జిబిషన్ ప్రదర్శనలు అబ్బురపరిచింది. చిత్రలేఖనం, వ్యాసరచన, కథ రచనలతో వివిధ అంశాల్లో పోటీలను నిర్వహించారు. దీంతో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రాంగణంలో సందడి నెలకొంది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ కేవీ రమణాచారి, సినీ గేయ రచయిత అశోక్ తేజ, భారత్ విద్యా సంస్థల సీహెచ్ వేణుగోపాల్ రెడ్డి, ప్రముఖ కవి, రచయిత నందిని సిధారెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా రమణాచారి మాట్లాడుతూ పిల్లల క్రమశిక్షణ, వారి ఆలోచన ధోరణి బాగుంటే ఈ సమాజాకి ఎంతో మేలు చేస్తారన్నారు. ఆ దిశగా అందరూ కృషిచేయాల్సిన వవసరం ఉందని చెప్పారు. విద్యా విజయాల కోసం కాదు విలువల కోసం అన్నారు. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత తల్లి దండ్రులు, ఉపాధ్యాయులపై ఉందన్నారు. పిల్లల్లో దాగిన అద్భుత అసమాన ప్రతిభ పాఠవాలకు వేదికగా నాలుగేండ్లుగా ప్రతి ష్టాత్మకంగా బాలోత్సవం – పిల్లల జాతర నిర్వహిండచం అభినందనీయమన్నారు. ఆహ్వాన సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడారు. కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చొక్కాపు వెంకటరమణ, సీనియర్ సంపాదకులు వినయ్ కుమార్, బాల సాహిత్య, బాలోత్సవం కమిటీ ప్రధాన కర్యాదర్శి ఎన్.సోమయ్య, కోశాధికారి బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

## ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓపెన్ వర్సిటీ 'డిజిటల్' పోరు

### డా.బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఉద్యోగుల జేఏసీ

బంజారాహిల్స్, నవంబర్ 22: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి చెందిన 10 ఎకరాల స్థలాన్ని జేఎన్‌ఏఎఫ్‌ఏయూకి కేటాయించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని రెండు నెలలుగా ఉద్యోగులంతా నిరసన కార్యక్రమాలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇంత జరుగుతున్నా పట్టించుకోని ప్రభుత్వంపై డిజిటల్ మీడియా ద్వారా కూడా ఆందోళన ఉధృతం చేయాలని జేఏసీ నేతలు నిర్ణయించారు. శుక్రవారం మధ్యాహ్నం యూనివర్సిటీ ప్రాంగణంలో నిరసన కార్యక్రమంలో భాగంగా జేఏసీ చైర్ పర్సన్ ప్రొ. పల్లవీ కాబ్డే, కన్వీనర్ ప్రొ. వడ్డాణం శ్రీనివాస్ తదితరులు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే దాకా ఆందోళన కొనసాగుతుందని, ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసేందుకు డిజిటల్ మీడియాను వినియోగించుకోనున్నామని పేర్కొన్నారు.

## నేడు, రేపు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం

ధారూరు, నవంబర్ 22: శని, ఆదివారాలు రెండు రోజులు ప్రత్యేక ఓటరు నమోదు కార్య క్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ధారూరు తహసీల్దార్, నియోజకవర్గ ఎన్నికల నమోదు సహాయ అధికారి షాజిదా బేగం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జనవరి, ఒకటి 2025 నాటికి 18 సంవత్సరాలు నిండబోయే యువత ఓటుహక్కు పొందడానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభం

దౌల్తాబాద్, నవంబర్ 22: మండలంలోని చెల్లాపూర్ గ్రామంలో శుక్రవారం కబడ్డీ టోర్నమెంట్‌ను దౌల్తాబాద్ ఎస్ఐ రవిగౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, మాజీ సర్పంచు శరణయ్య, మాజీ జడ్పీటీసీ పకీరప్ప, లింగప్ప, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్, రాజప్ప, శ్యామప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌టీవో పై చర్యలు తీసుకోవాలి

వికారాబాద్, నవంబర్ 22: డీఎస్సీ 2024 ద్వారా కొత్తగా నియామకమైన ఉపాధ్యాయుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న కొడంగల్ ఎస్‌టీవో పై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని టీయస్ యూటీఎఫ్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటరత్నం, రాములు జిల్లా ఖజానా అధికారి (డీటీవో )కి శుక్రవారం ఫిర్యాదు చేశారు. కొడంగల్ ఎస్‌టీవో పరిధిలోని దౌల్తాబాద్, కొడంగల్, బొంరాస్‌పేట్, దుద్యాల మండలాలలో నూతనంగా నియామకం పొందిన ఉపాధ్యాయుల నుంచి స్కూల్ కాంప్లెక్స్, ప్రధానోపాధ్యాయులు బిల్లులు నిర్వహించే సీఆర్పీలు ఒక్కొక్కరి నుంచి 800 నుంచి 1000 రూపాయల వరకు ఎస్‌టీవో పేరుతోవసూలు చేస్తున్నారన్నారు. వీరి అక్రమాల నివారించి సంబంధిత ఎస్‌టీవో పై పాఠశాలల నుంచి బిల్లులు నిర్వహిస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బసప్ప శీను తదితరులు పాల్గొన్నారు.

### డిసెంబర్ 5, 6 తేదీల్లో

## ఢిల్లీలో బీసీల నిరసన

### జాజుల శ్రీనివాస్ గౌడ్

ఖైరతాబాద్, నవంబర్ 22: బీసీ కుల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో డిసెంబర్ 5, 6 తేదీల్లో ఢిల్లీలో రెండు రోజుల నిరసన కార్యక్రమాలను చేపడుతున్నామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, ఈ నెల 25 నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభమవుతున్నాయని, కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే బీసీ బిల్లు ప్రవేశపెట్టి చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర కుటుంబ సర్వే మాదిరిగానే దేశ వ్యాప్తంగా వచ్చే ఏడాది బీసీ గణన చేపట్టాలన్నారు. గడిచిన పదేండ్ల కాలంలో బీసీలపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ డిసెంబర్ 5న జంతర్ మంతర్ వద్ద భారీ ధర్నా చేపడుతున్నామని, 6న ఢిల్లీలోని కానిస్టిట్యూషన్ క్లబ్‌లో దేశంలోని పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం వహిస్తున్న 26 రాజకీయ పార్టీలతో అఖిల పక్ష సమావేశాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల వల్ల రాష్ట్రంలోని ఉద్యోగాల నోటిఫికేషన్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. డీఎస్సీ, గ్రూప్–1, 2, 4లలో ఇలా ప్రతి పరీక్షల్లో మెరిట్ మార్కు సాధించిన బీసీలకు ఉద్యోగాలు రావడం లేదని, కానీ, అగ్రకులాలకు మాత్రం అర్హత లేకున్నా ఉద్యోగాలు వస్తున్నాయన్నారు. బీసీ బిల్లు పెట్టేంత వరకు కేంద్ర ప్రభుత్వానికి వదిలేది లేదన్నారు. సమావేశంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేశ్ చారి, కన్వీనర్ బాల రాజు గౌడ్, బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పాము కాటుతో చిన్నారి మృతి

యాలాల, నవంబర్ 22: పాము కాటుతో చిన్నారి మృతి చెందిన ఘటన యా లాల మండల పరిధిలోని గంగాసాగర్ గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... అంజిలప్ప, నర్సమ్మల మొదటి పాప సహస్ర(7) సాయంత్రం ఆడుకుంటుండగా సంచుల మధ్య ఉన్న నాగుపాము పాపను కాటు వేసింది.

## ఆర్టీసీ కంట్రోలర్ ఆత్మహత్య

పరిగి, నవంబర్ 22 : పురుగుల మందు తాగి ఆర్టీసీ కంట్రోలర్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పరిగి మండలం రంగంపల్లిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే రంగంపల్లి గ్రామానికి చెందిన బి. భూపతి రెడ్డి పరిగి ఆర్టీసీ బస్టాండ్‌లో కంట్రోలర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం భూపతిరెడ్డి పురుగుల మందు తాగగా ఆయనను కుటుంబసభ్యులు వెంటనే పరిగి ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం వికారాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. భూపతి రెడ్డికి ఒక కుమారుడు, ఒక కూతురుండగా కూతురు వివాహమైంది. ఆయన గత రెండు రోజులుగా విధులకు హాజరుకాలేదు. ఉన్నతాధికారుల ఒత్తిళ్లు, వేధింపులు తాళలేక భూపతిరెడ్డి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**బహిరంగ ప్రకటన**

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, శ్రీ మహమ్మద్ జమీరుద్దీన్ తండ్రి మహమ్మద్ అజీజుద్దీన్, నివాసము: ఇం.నెం.4-11-20, రామ్‌నగర్, నియర్ సెంట్రల్ లైబ్రరి, మహబూబ్‌నగర్, తెలంగాణ వాస్తవ్యులు స్వార్జితం క్రింద సంపాదించిన ఆస్థిని తనఖా పెట్టుకొని శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్, షాద్‌నగర్ బ్రాంచ్ వారు లోను 